క్లుప్తంగా

భూమి కౌలుకు బహిరంగ వేలం



వేలం పాట నిర్వహిస్తున్న దేవస్థాన సిబ్బంది

కె.గంగవరం: కుడుపూరులో ఉన్న నీలకంఠేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన అన్యాక్రాంతమైన భూమిని గుర్తించి ఇటీవల దేవస్థాన అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 4.21ఎకరాల భూమిని కౌలుకు రామచంద్రపురం తనిఖీదారు ఆర్. బాలాజీ రామ్‌ప్రసాద్ సమక్షంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. రెండు విడతలుగా నిర్వహించిన ఈ వేలంలో మొదటి 2 ఎకరాల 21 సెంట్ల భూమిని గ్రామానికి చెందిన పెండెం త్రిమూర్తులు రూ. 92 వేలకు హెచ్చు పాడుకున్నారు. రెండో విడత 2 ఎకరాల భూమిని కౌలుకు సాగు చేసుకునేందుకు గ్రామానికి చెందిన కట్టా సత్తిపండు రూ.60 వేలకు హెచ్చు పాడుకున్నారు. ఈ వేలం ద్వారా ఆలయానికి రూ.1.52 లక్షల ఆదాయం సమకూరిందని కార్యనిర్వహణాధికారి యంవీవీ సత్యనారాయణ తెలిపారు. సర్పంచ్ పిల్లి రాంబాబు, దేవస్థాన సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలోని 27వ వార్డులో పురపాలక సంఘం సాధారణ నిధులు రూ.8.5 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీపై శ్లాబ్‌ల ఏర్పాటు పనులను మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మంగళవారం పరిశీలించారు. 28వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.8.3 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను ఆమె పరిశీలించారు. ఆమెతోపాటు కౌన్సిలర్లు నీలం దుర్గ, మొండి భవాని, కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు జిన్నూరి సాయిబాబా, వైఎస్సార్ సీపీ నాయకులు ఈలి తాతాజీ, ఎస్.సూరిబాబు, సచివాలయ కార్యదర్శి కృష్ణారెడ్డి ఉన్నారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ



నాయకులతో మాట్లాడుతున్న మదన్‌మోహన్‌రావు

కపిలేశ్వరపురం (మండపేట): రానున్న సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్టు ఓటరు నమోదు అధికారి మదన్ మోహన్‌రావు తెలిపారు. మండపేటలో మంగళవారం మండపేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని రాజకీయ పార్టీల నాయకుల సమావేశం నిర్వహించారు. గత వారం రోజులుగా తమకు అందిన ఓటరు నమోదు దరఖాస్తుల పరిశీలనా తీరును వివరించారు. ఈవీఎంల పనితీరుపై ప్రజల్లో ప్రయోగాత్మక కార్యక్రమాలకు రాజకీయ ప్రతినిధులు సహకరించాలని కోరారు. సహాయ ఓటరు నమోదు అధికారి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆర్ట్స్‌క్రాఫ్ట్ అండ్ సైన్సు ఎగ్జిబిషన్



వికాస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ప్రదర్శన

రామచంద్రపురం: పట్టణంలోని వికాస్ స్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఆర్ట్స్, క్రాఫ్ట్ అండ్ సైన్సు ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. వికాస్ విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వి.వి.రమణ, ప్రిన్సిపాల్ వీఎన్‌జే లక్ష్మీబాయి ఆధ్వర్యంలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ విద్యార్థులు ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొని వివిధ ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. చదువుతో పాటుగా స్వతహాగా ఆలోచించి తమ సృజనాత్మకశక్తిని వివిధ రకాల ఆకృతులను తయారు చేయడం ద్వారా వారి నైపుణ్యాలను అద్భుతంగా ప్రదర్శించారని కరస్పాండెంట్ రమణ అన్నారు. చిన్నారుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం: గర్భిణుల ఆరోగ్యంపై వారి సహాయకులు అవగాహనతో మెలగాలని సీనియర్ వైద్యురాలు కె.కన్యాకుమారి అన్నారు. అంగర పీహెచ్‌సీలో డాక్టర్ జీవీ గీతాంజలి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శిబిరంలో 73 మంది గర్భిణులను పరీక్షించారు. వారిలో హైరిస్క్ కేసులుగా 12 మందిని గుర్తించి మెరుగైన చికిత్స కోసం ఉన్నతాధికారులకు నివేదించారు. ఇద్దరిని తక్షణ అవసరంగా గుర్తించి మెరుగైన పరీక్షల కోసం ఉన్నత ఆసుపత్రికి తరలించారు. గ్రామానికి చెందిన జిల్లా వైఎస్సార్ సీపీ బీసీ విభాగం ఉపాధ్యక్షుడు పసలపూడి శ్రీనివాస్, వ్యాపారవేత్త రాగం రామచంద్రరావులు గర్భిణులకు పోషకాహారాన్ని అందజేశారు.

ఉత్సాహం ఉరకలెత్తి..

- నేటి నుంచి మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్రా'
- తలపడనున్న సచివాలయాల జట్లు
- పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- ఒక్కో మండలానికి రూ.25వేల మంజూరు



సచివాలయ స్థాయిలో ఆడుతున్న క్రీడా పోటీలు

రాయవరం: గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఆడుదాం ఆంధ్రా పేరుతో ప్రభుత్వం క్రీడా పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేసింది. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు నిర్వహిస్తోన్న ఈ క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రెట్టించిన ఉత్సాహంతో క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ప్రధాన లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలను ఐదు దశల్లో నిర్వహిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ప్రస్తుతం సచివాలయ స్థాయిలో మొదటి దశ పూర్తి చేసుకుని, మండల స్థాయి పోటీలకు సన్నద్ధమవుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నిర్వహిస్తోన్న పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తున్నారు. మండల స్థాయి క్రీడా సంబరానికి ఆయా మండలాల ఎంపీడీవోల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

పోటీల నిర్వహణకు నిధులు మంజూరు

ఆడుదాం ఆంధ్రాలో భాగంగా క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ వంటి ఐదు ప్రధానమైన క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. పురుషులు, మహిళల విభాగంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రీడా పోటీల నిర్వహణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ఇందులో భాగంగా నిర్వహిస్తోన్న ఐదు క్రీడాంశాలు సచివాలయ స్థాయిలో నిర్వహించిన పోటీలు విజయవంతంగా పూర్తి చేశారు. రెండో దశ మండల స్థాయి పోటీలు నిర్వహించనుండగా.. అందుకు అవసరమయ్యే క్రీడా సామగ్రిని ఇప్పటికే ప్రభుత్వం సమకూర్చింది. తాజాగా మండల స్థాయిలో పోటీల నిర్వహణ కోసం ఒక్కో మండలానికి రూ.25 వేలు వంతున క్రీడా ప్రాంగణాలు అభివృద్ధి, నిర్వహణ ఖర్చుల నిమిత్తం మంజూరు చేసింది. ప్రతి మండలానికి కనీసం నాలుగు ఆట స్థలాలను, గరిష్టంగా ఆరు ఆట స్థలాలను సిద్ధం చేశారు. ఈ నెల 20వ తేదీ వరకు క్రీడా పోటీలు నిర్వహిస్తారు. ఐదు రకాల గేమ్స్‌కు సంబంధించి, మహిళలు, పురుషుల వారీగా మండలానికి సుమారుగా 188 టీంలు పాల్గొంటున్నాయి. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రామచంద్రపురం పట్టణాలతో పాటుగా రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం మండలాల పరిధిలో 132 సచివాలయాలున్నాయి. ఈ సచివాలయాల పరిధిలోని సుమారుగా 1,320 టీమ్‌లు పోటీ పడనున్నాయి.

విజయవంతంగా..



ఆడుదాం ఆంధ్రా పోటీలు రెండో దశకు చేరుకున్నాయి. ప్రతి పంచాయతీ పరిధిలో ఉన్న సచివాలయాల పరిధిలో పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాం. ఇప్పుడు మండల స్థాయి పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇందులో విజేతలుగా నిలిచిన జట్లు నియోజకవర్గ స్థాయిలో పోటీ పడాల్సి ఉంటుంది.

– కొవ్వూరి నరేంద్రరెడ్డి, ఎంపీడీవో, రాయవరం

క్రీడాకారుల్లో ఉత్సాహం



ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు ఊహించని విధంగా క్రీడాకారుల నుంచి స్పందన వచ్చింది. ప్రతి దశలోను క్రీడా పోటీలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. మండల స్థాయిలో క్రీడా పోటీలు విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం . క్రీడాకారులు కూడా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. క్రీడలను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున వస్తున్నారు.

– ఎ.శాంతి, రామచంద్రపురం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి, రామచంద్రపురం

పింఛన్ల పంపిణీ



నెలపర్తిపాడులో వృద్ధుడికి పింఛను అందజేస్తున్న సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: మండలంలో లబ్ధిదారులకు వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ చేతుల మీదుగా మంగళవారం పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ తెలుగుదేశం పరిపాలనలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పింఛను రూ.1000 ఇస్తూ ఎన్నికల సమయంలో రూ.2 వేలు చేస్తామని ప్రజలను మభ్యపెట్టారన్నారు. కానీ వైఎస్సార్ సీపీ పాలనలో ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ రూ.3 వేల చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, సర్పంచులు అయ్యల అమ్మాజీ, కట్టా గోవిందు, కొత్తపల్లి అరుణ, యల్లమిల్లి సతీష్‌కుమారి, మాజీ జడ్పీటీసీ ఇంత సంతోషం, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాపవరంలో సూర్యప్రకాశ్ పర్యటన



కాపవరంలో సూర్యప్రకాశ్‌కి హారతులు ఇస్తున్న మహిళ

రామచంద్రపురం రూరల్: కాపవరంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ మంగళవారం పర్యటించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు జరుగుతున్న మేలును వివరించారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అందరికీ అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గీసాల శివ, మాజీ సర్పంచ్ గీసాల సత్యానారాయణ, మాజీ ఎంపీటీసీ గీసాల ప్రకాశం, కొల్లపు రాంబాబు, కొండమూరి శ్రీరాములు, వాసంశెట్టి గోవిందు, సలగల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు కృత్తివెంటి

- వాకర్స్ గౌరవాధ్యక్షుడు తొగరు మూర్తి
- ఘనంగా కృత్తివెంటి పేర్రాజు పంతులు సంస్మరణ కార్యక్రమం



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న తొగరు మూర్తి తదితరులు

రామచంద్రపురం: రామచంద్రపురం పరిసర ప్రాంతాల అభ్యున్నతి కోసం విద్య ఒక్కటే మార్గమని, సుమారుగా 98 ఎకరాలను దానం చేసి పాఠశాలను అభివృద్ధి చేసిన మహనీయుడు కృత్తివెంటి పేర్రాజు పంతులు అని, ఆయన ఆశయా సాధనకు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్, పట్టణ వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు తొగరు మూర్తి పిలుపునిచ్చారు. పట్టణంలో కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో పేర్రాజు పంతులు సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ముందుగా ఉద్యానవన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టబ్బాయి, తొగరు మూర్తితో కలిసి కృత్తివెంటి పేర్రాజు పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మూర్తి మాట్లాడుతూ ఆయన త్యాగాలను ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పేదరికం చదువుకు అడ్డు రాకూడదని 1906 లో తన కష్టార్జితం తో సంపాదించిన 98 ఎకరాల భూమిని దానం గా ఇచ్చి పాఠశాలను నిర్మించి,విద్యార్థుల క్రీడాభివృద్ధికి పది ఎకరాల స్థలాన్ని ఏర్పాటు చేయటం కృత్తి వెంటి దూర దృష్టికి నిదర్శనమన్నారు. బ్రిటిష్ కాలంలోనే పేద పిల్లలకు మధ్యాహ్నం భోజనం పెట్టి ఉచితంగా విద్యను అందించిన విద్యాదాత కృత్తివెంటి అని అటువంటి మహనీయుడు మన ప్రాంతంలో పుట్టడం మన అందరి అదృష్టమని తెలిపారు. తాను దానం చేసిన భూమిలో వచ్చే ధనంతో రైతులకు వ్యవసాయంలో మెలకువలు నేర్పే వ్యవసాయ కళాశాల, పండ్ల తోటలు మొక్కలు వంటి పెంపకంలో ఉద్యానవన కళాశాల, పశువుల పెంపకంలో వెటర్నరీ కళాశాల ఏర్పాటు చేయాలని ఆశయంతోనే భూమిని దానం చేశారన్నారు. అనంతరం ఉద్యానవన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టబ్బాయి, హై స్కూల్ ప్రిన్సిపాల్ రఘువీరా రెడ్డి, అగ్రికల్చర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలక్ష్మిలను ఘనంగా సన్మానించారు. వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ పెద్దలు పామర్తి మధు, చుండ్రు వెంకటరావు చౌదరి, గుబ్బల శ్రీనివాస్, జిమ్ కోచ్ రమణ, పరసవేది లక్ష్మణరావు, బాబ్జి, పెంటపాటి అన్నవరం, బలుసు శ్రీనివాస్ చౌదరి, తాడాల సత్యనారాయణ, కూడ్రపు శ్రీనివాస్, ధనలక్ష్మి, పోతంశెట్టి రామకృష్ణ, మహమ్మద్ ఆల్తాఫ్, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గనిపోతురాజు ఆలయ హుండీ లెక్కింపు



కేశవరంలో హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం కేశవరంలోని గనిపోతురాజు ఆలయ హుండీని మంగళవారం సంబంధిత అధికారులు సమక్షంలో లెక్కించారు. ఆలయ ఈఓ శ్రీనివాస్, కమిటీ చైర్మన్ కూసు నరసింహ మూర్తి, సభ్యులు పురంశెట్టి శ్రీను, కుర్రా సత్తిబాబు, మటాోట్ బహ్మనాయుడు పర్యవేక్షణలో లెక్కించగా భక్తులు వేసిన కానుకలను రూ.1,50,925గా గుర్తించారు. లెక్కింపును వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, నాయకులు తుపాకుల ప్రసన్న కుమార్ పరిశీలించారు.

పేద ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం



కురకాళ్లపల్లిలో ఆరోగ్యశ్రీ కార్డులతో లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు



అంద్రంగిలో పాల్గొన్న అధికారులు, నాయకులు, వైద్యులు

రాయవరం: పేద ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ పేర్కొన్నారు. కురకాళ్లపల్లిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ పిల్లి శారద ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యానికి ఇస్తున్న ప్రాధాన్యత గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులపై వైద్య పరిమితిని ప్రభుత్వం రూ.25లక్షలకు పెంచిందన్నారు. పేద ప్రజల వైద్యానికి ప్రభుత్వం భరోసానిస్తుందన్నారు. శిబిరంలో 225 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కంటి సమస్యలతో బాధపడుతున్న 55 మందికి పరీక్షలు చేశారు. నూతనంగా మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పితాని ప్రసాద్, పీఎంసీ చైర్మన్ కురుపూడి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రాయుడు సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నేతలు నల్లమిల్లి వెంకటరెడ్డి, పిల్లి ప్రసాద్, వాసంశెట్టి సూర్యనారాయణ పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశే సీఎం లక్ష్యం

కాజులూరు: పేద, మధ్య తరగతి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించడంతోపాటు వారి ఆరోగ్య పరిరక్షణకు పథకాన్ని రూపొందించి రాష్ట్రాన్ని సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పెనుమళ్ళ పీఏసీఎస్ చైర్మన్ సమనాశి సామన్న అన్నారు. మంగళవారం అంద్రంగిలో అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్. సౌజన్య ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన పలువురు నిపుణులైన వైద్యులు పాల్గొని సుమారు 314 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. గ్రామ సర్పంచ్ పెదిరెడ్డి నాగసుజాత, ఎంపీటీసీ మట్టా వెంకటరమణమ్మ, మాత మురళి, నరాల రాజారావు, వీరభద్రరావు, సచివాలయాల సిబ్బంది, ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



హైస్కూల్‌లో భోగి మంట వేస్తున్న విద్యార్థులు, నాయకులు

కాజులూరు: స్థానిక కోటి హైస్కూల్‌లో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలుగు సంస్కృతి, గ్రామీణ పండగలు, సంప్రదాయాలను వివరిస్తూ హరిదాసుల వేషధారణలతో కీర్తనలు ఆలపిస్తూ వినూత్నరీతిలో విద్యార్థులు ప్రదర్శనలు నిర్వహించారు. సంక్రాంతి పండగ వాతావరణం ఉట్టిపడేలా భోగిమంటలు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. ఆంధ్రా పిండి వంటలు తయారు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలువురు విద్యార్థులు పోటాపోటీగా ముగ్గులు పెట్టి చూపరులను ఆకర్షించారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు, పార్టీ జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు దంగేటి అరుణ్ కుమార్, యాళ్ళ సత్తిబాబు, మాజీ ఎంపీపీ యాళ్ళ కృష్ణారావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దూడల శంకరనారాయణ, జనసేన నాయకుడు చిక్కాల దొరబాబు, పలువురు స్థానిక అధికారులు, నాయకులు కార్యక్రమాన్ని తిలకించి విద్యార్థులను అభినందించారు. పోటీలలో విజేతలకు పాఠశాల నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

పిల్లి అప్పారావు సేవలు ఆదర్శనీయం



అప్పారావు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న శ్యాం

కె.గంగవరం: మాజీ ఎమ్మెల్యే పిల్లి అప్పారావు సేవలు ఆదర్శనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పామర్రులో మంగళవారం అప్పారావు 37వ వర్ధంతిని ఆయన కుటుంబ సభ్యుల సమక్షంలో నిర్వహించారు. తొలుత స్థానికంగా ఉన్న అప్పారావు విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఆయన హాయంలో చేసి అభివృద్ధిని గురించి కొనియాడారు. వైఎస్సార్ సీపీ స్టేట్ ఇండస్ట్రీయల్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యాం, రామచంద్రపురం శెట్టిబలిజ సంఘం అధ్యక్షులు దొంగల శ్రీధర్, కుడుపూడి శ్రీనివాస్, సర్పంచ్ వాసంశెట్టి వెంకటదుర్గ సూరిబాబు, పంపన రవి, ప్రసాద్, పంతే రవిచంద్ర, పంపన అప్పారావు తదితరులు ఈ వర్ధంతి వేడుకల్లో పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పిల్లి అప్పారావు వర్ధంతిని పురస్కరించుకుని మండలంలో వైఎస్సార్ సీపీ నాయకులు, అప్పారావు అభిమానులు మంగళవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన స్వగ్రామం వెంకటాయపాలెంలోను, ద్రాక్షారామలోను ఏపీఐడీసీ డైరెక్టర్, పిల్లి అప్పారావు మనవడు వాసంశెట్టి శ్యామ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నియోజవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వక్తలు అప్పారావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, తాలూకా శెట్టిబలిజ సంఘం మాజీ అధ్యక్షుడు కట్టా సూర్యనారాయణ, మండల అధ్యక్షుడు దొంగల శ్రీధర్, సర్పంచ్ యల్లమిల్లి సతీష్ కుమారి తదితరులు పాల్గొన్నారు. నరసాపురపుపేటలో శెట్టిబలిజ సంఘం పెద్దలు కొప్పిశెట్టి ఏడుకొండలు, దంగేటి లోవరాజుల ఆధ్వర్యంలో అప్పారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పేదలకు కార్పొరేట్ విద్య

- ఎంపీపీ మాత భారతి
- విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత



కాజులూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌ల పంపిణీ చేస్తున్న నాయకులు

కాజులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలకు కార్పొరేట్ విద్య అందుతోందని ఎంపీపీ మాత భారతి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం 153 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లను నాయకులు పంపిణీ చేసారు. ఈ సందర్భం గ్రామ సర్పంచ్ దండంగి సరోజిని అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ గతంలో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాలంటూ పలు కార్యక్రమాల్లో నాయకులు ఆర్భాటంగా ప్రసంగాలు చేసేవారే తప్ప అప్పటి పాలకులేవ్వరూ దానికను గుణంగా నిధులు మంజూరు చేయలేదన్నారు. జగనన్న నాడు-నేడు పథకంతో ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేయడమే కాకుండా ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి బైజూస్ వంటి సంస్థల ద్వారా ట్యాబ్‌లతో టెక్నాలజీతో కూడిన విద్యను అందిస్తున్నారన్నారు. ఇది దేశ విద్యారంగంలోను ఒక అపురూప ఘట్టం అని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బరావు, స్కూల్ హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కోన రాధాకృష్ణ, పార్టీ నాయకులు కట్టా శేఖర్, యాళ్ళ సత్తిబాబు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థాయి మరచి ఎమ్మెల్సీ తోటపై విమర్శలు చేస్తే సహించం

మండపేట నియోజకవర్గ దళిత నేతలు



మండపేటలో మాట్లాడుతున్న దళిత నాయకులు

కపిలేశ్వరపురం: జనసేన మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ ప్రజా క్షేత్రంలో విఫలమైన నేత అని, అలాంటి లీలాకృష్ణ తన స్థాయిని మరచి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై విమర్శలు చేస్తే సహించేది లేదని మండపేట నియోజకవర్గంలోని దళిత నాయకులు మండిపడ్డారు. మండపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఏడిద సర్పంచ్ బూరుగ ఆశీర్వాదం, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, దళిత నాయకులు పాలంకి కమల, పలివెల సుధాకర్, ఉంద్రాజవరపు అర్జున్, పాలమాల సత్తిబాబు, కోనాల చంద్రబటస్, మడికి ఆనందరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్ మాట్లాడారు. ఇటీవల ఏడిదలో పర్యటించిన వేగుళ్ల లీలాకృష్ణ తమ నాయకుడు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ప్రజా క్షేత్రంలో నిలబడలేక లీలాకృష్ణ ఎమ్మెల్సీ తోటను ప్రస్తావిస్తూ శిరోముండనం కేసుపై మాట్లాడుతుండడాన్ని తప్పుపట్టారు. కేసు కోర్టు పరిధిలో ఉందని అనేక సార్లు దళితులమంతా చెబుతున్నామని గుర్తు చేశారు. కుల ధృవీకరణకు సంబంధించి సరైన ఫార్మాట్‌లో దరఖాస్తు చేసుకోమని కోర్టు చెప్పగా ఆ విషయాన్ని లీలాకృష్ణ వక్రీకరించి ప్రచారం చేస్తున్నారన్నారు. ఆ కేసు నమోదు తర్వాత తోట దళితులతో సహా అన్ని వర్గాల మద్దతుతో నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారన్న విషయాన్ని లీలాకృష్ణ గుర్తించాలన్నారు. లీలాకృష్ణ దళిత వ్యతిరేకి అని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు 15 కేసులను ఎదుర్కొంటున్నారన్నారు. మండపేట పట్టణంలో డాక్టర్ బీఆర్‌అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్న ఎమ్మెల్సీ తోట నియోజకవర్గమంతా ప్రశంసలందుకుంటున్నారన్నారు. ఓర్వలేక తప్పుడు ఆరోపణల చేస్తున్నారన్నారు. దళిత నాయకుడు ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చిన లీలాకృష్ణ దళిత పక్షపాతి తోటను విమర్శిస్తే సహించేది లేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రజల్లో పని చేస్తున్న తీరులను నియోజకవర్గంలోని ప్రజలంతా ప్రశంసిస్తున్నారన్నారు. ఇప్పటికైనా లీలాకృష్ణ ఎమ్మెల్సీ తోటపై విమర్శలు చేయడాన్ని మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజాక్షేత్రమే సరైన గుణపాఠం నేర్పుతుందని దళిత నాయకులు హెచ్చరించారు.